# నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం

**- 104 కోట్ల పనులపై అధికారులతో సమీక్ష**



వార్తాపత్రిక, కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచి ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. ఇప్పటికే మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి, కొత్త ప్రతిపాదనలను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని పలు పరిధులకు చెందిన మహానగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగ అధికారులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.32 కోట్ల విలువగల పనులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. కొత్తగా ప్రతిపాదించిన రూ.72 కోట్ల పనులను త్వరగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.బస్తీలు, కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. సిమెంట్ రహదారులు, రహదారి మరమ్మతులు, భూగర్భ కాలువలు, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు.
పట్టణీకరణ, జనాభా పెరుగుదల దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో భూగర్భ కాలువల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపట్టి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లికార్జున్ ఖార్గే విష సర్పాలు వ్యాఖ్యలను ఘోరంగా ఖండించారు

**- మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా బి. జె.పి ఓ.బి.సి మోర్చా సోషల్ మీడియా కో కన్వీనర్ తోలుపు నూరి రమేష్ గౌడ్**



వార్త ప్రతిక :-హైదరాబాద్ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే 'విష సర్పాలు' వ్యాఖ్యలను ఘోరంగా ఖండించారు.భారతీయ జనతా పార్టీ ఓ.బి.సి మోర్చా మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ తోలుపు నూరి రమేష్ గౌడ్,కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే భిన్నమైన, దారుణమైన వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ, వాటిని పూర్తిగా ఖండించారు. బి.జె.పి ఆర్.ఎస్.ఎస్ నాయకులను 'విష సర్పాలు'గా పేర్కొన్న ఖార్గే ఉద్దేశపూరిత విష వాక్యాలు దేశ రాజకీయాల్లో మాతృభూమి గౌరవాన్ని, జాతీయ సద్భావాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి.ఈ రకమైన విరుద్ధ మతాలపై దౌర్జన్యాన్ని ప్రోత్సహించేలా అనిపించే మాటలు చెప్పడం ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడికి ఏ క్రమం ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడ్జెట్ సమావేశంలో ప్రతిపక్షాలు, సామాన్య ప్రజలపై దాడి చేసేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావడం ఇప్పటికే తెలిసింది. ఇప్పుడు కాంగ్రెస్ అగ్ర నాయకుడు బిజెపి- ఆర్ఎస్ఎస్ నాయకులపై దుర్మార్గ వ్యాఖ్యలు చేస్తున్నాడంటే, ఈ చట్టాలు కేవలం ప్రతిపక్షాలను, హిందూ సంస్కృతి రక్షకులను అణచివేయడానికేనాఇది దేశవ్యాప్తంగా మత ద్వేషాన్ని కలిగించే కుట్రగా కనిపిస్తోంది. తోలుపు నూరి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.బాధ్యతాయుతంగా ఉండాల్సిన ఒక పార్టీ అధ్యక్షుడు ఇలాంటి విషపూరిత మాటలు మాట్లాడటం దేశ డెమాక్రసీకి మాయమే ఖార్గే తమ పార్టీలోనే అంతర్గత కలహాలకు తగిన చర్యలు తీసుకోకుండా, జాతీయ స్థాయి నాయకులను విష సర్పాలుగా చిత్రీకరించడం దారుణం. ఇది ఆపకపోతే, మేము ఎన్నికల సంఘానికి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని.హెచ్చరించారు.బిజెపి.ఓ. బి.సి.మోరా ,మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా నాయకత్వం ఈ ఘటనపై తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, కాంగ్రెస్ నాయకత్వానికి ఈ విష భాషణలు వద్దని, దేశ సామరస్యాన్ని
కాపాడాలని డిమాండ్ చేస్తోంది.


# డీఈఓ కడప ప్రసాద్ బాబుకు గుండెపోటు

**- ఐసీయూలో కొనసాగుతున్న చికిత్స**



అనంతపురం: వార్తాపత్రిక ప్రతినిధి :అనంతపురం జిల్లా డీఈఓ కడప ప్రసాద్ బాబు గుండెపోటుకు గురయ్యారు.
పది తరగతి పబ్లిక్ పరీక్షల విధుల్లో భాగంగా స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలో ఉండగా అస్వస్థకు గురయ్యారు.
వెంటనే ఆ శాఖ ఉద్యోగులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో గుండె నాళం బ్లాక్ అయినట్లు గుర్తించిన వైద్యులు.. ఆయన్ను ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. త్వరలోనే ఆయనకు స్టంట్ వేయనున్నట్లు వైద్య బృందం తెలిపింది. ప్రస్తుతం ప్రసాద్ బాబు ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య బృందం వెల్లడించింది.
కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి దగ్గరుండి సపర్యలు చేస్తున్నారు.
ఎప్పుడూ అందరితో కలివిడిగా ఉండే ప్రసాద్ బాబు తొందరగా కోలుకోవాలని అందరూ కోరుకుంటున్నారు.

# హార్ట్ బ్లాకేజ్ ఉంటే శరీరంలో కనిపించే లక్షణాలు ఇవే.. ముందే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుంది..



హార్ట్ బ్లాకేజ్.. దీన్నే వైద్య పరిభాషలో కొరోనరీ ఆర్టరీ డిసీజ్ పిలుస్తారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే కొరోనరీ ధమనులను ప్రభావితం చేస్తుంది. గుండె కండరాలకు సరైన రక్త ప్రవాహం లేకపోవడం వల్ల గుండె పనితీరు దెబ్బతింటుంది. సాధారణంగా కొవ్వులు, కొలెస్ట్రాల్, ఇతర పదార్థాలు ధమనుల గోడలపై పేరుకుపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. దీనిని అథెరోస్క్లెరోసిస్ అని పిలుస్తారు. ఈ ప్లాక్ పేరుకుపోవడం వల్ల ధమనులు సన్నగిల్లి, గుండెకు సరైన రక్తం అందకపోవడంతో లక్షణాలు కనిపిస్తాయి. పూర్తిగా బ్లాకేజ్ ఏర్పడితే హార్ట్ అటాక్‌కు దారితీస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం గుండె సంబంధిత వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణంగా ఉన్నాయి.
ఛాతిలో పట్టేసినట్లు ఉంటుంది..ఔను అంచనాల ప్రకారం 2022లో సుమారు 19.8 మిలియన్ల మంది గుండె సంబంధిత వ్యాధుల వల్ల మరణించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా మొత్తం మరణాల్లో సుమారు 32 శాతంగా ఉంది. వీటిలో 85 శాతం మరణాలు హార్ట్ అటాక్, స్ట్రోక్ కారణంగా సంభవించాయి. హార్ట్ బ్లాకేజ్ ప్రారంభ దశ లక్షణాలు చాలా సున్నితంగా ఉండి, సాధారణంగా ఒత్తిడి లేదా నిద్రలేమి వంటి సమస్యలతో కలిపి ఉంటాయి. అయితే ఈ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే వ్యాధిని త్వరగా గుర్తించి తీవ్రమైన ప్రమాదాలను నివారించవచ్చు. ఛాతిలో అసౌకర్యం ఈ వ్యాధి ప్రారంభ సంకేతాల్లో ఒకటి. ఛాతిలో స్వల్ప ఒత్తిడి లేదా పిండి పడినట్లుగా అనిపించడం, ఇది అత్యవసర పరిస్థితిలా అనిపించకపోయినా, అంగైనా అనే పరిస్థితిని సూచిస్తుంది. ఇది బ్లాకేజ్ వల్ల రక్త ప్రవాహం తగ్గినప్పుడు కలుగుతుంది. ఇది పదునైన నొప్పిలా కాకుండా అజీర్ణం లాగా అనిపించవచ్చు. విశ్రాంతితో తగ్గుతుంది. అయితే ఈ లక్షణం తరచూ కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. ముఖ్యంగా మహిళలు లేదా మధుమేహం ఉన్నవారిలో ఇది అలసట లేదా గుండెల్లో మంట రూపంలో కనిపించే అవకాశాలు ఉంటాయి.శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు..శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా ఒక ముఖ్యమైన లక్షణం. రెండు అంతస్తులు ఎక్కిన తర్వాత లేదా మాట్లాడుతున్న సమయంలో శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపిస్తే, గుండె సరైన రీతిలో ఆక్సిజన్ ఉన్న రక్తాన్ని పంపించలేకపోతుందని సూచిస్తుంది. ఇది అకస్మాత్తుగా లేదా క్రమంగా వచ్చే అవకాశాలు ఉంటాయి. సాధారణ పనులు చేస్తున్నప్పుడే ఇది కనిపిస్తే జాగ్రత్త అవసరం. నిరంతర అలసట కూడా గుండె బ్లాకేజ్ సంకేతంగా చెప్పవచ్చు. విశ్రాంతి తీసుకున్నా అలసట తగ్గకపోతే గుండె శరీర అవసరాలను తీర్చలేకపోతుందని అర్థం. ఇది సాధారణ అలసటతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా మహిళల్లో ఈ లక్షణం ఇతర లక్షణాల కంటే ముందే కనిపిస్తుంది. శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించే నొప్పి కూడా ఒక సంకేతం. దవడ, భుజాలు లేదా వెన్నులో నొప్పి కనిపించడం గుండె నుంచి వచ్చే నాడీ సంకేతాల వల్ల అయ్యే అవకాశాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఈ నొప్పి మాత్రమే ఏకైక లక్షణంగా కనిపిస్తుంది.తల తిరగడం, వికారం..తల నిర్బంధం లేదా తల తిరగడం కూడా గమనించాల్సిన లక్షణం. అకస్మాత్తుగా తల తిరగడం లేదా నిలబడినప్పుడు అస్థిరంగా అనిపించడం, మెదడుకు సరైన రక్త ప్రవాహం లేకపోవడం వల్ల జరుగుతుంది. తీవ్రమైన పరిస్థితుల్లో స్పృహ కోల్పోవడం కూడా సంభవించే అవకాశాలు ఉంటాయి. ఇది తక్షణ వైద్య చికిత్స అవసరాన్ని సూచిస్తుంది. వికార భావం లేదా చెమటలు పట్టడం కూడా గుండె సమస్యలకు సంకేతం కావచ్చు. ఎటువంటి జ్వరం లేకపోయినా లేదా ఆహార సమస్యలు లేకపోయినా వాంతి భావం, అజీర్ణం లేదా చెమటలు రావడం గుండె ఒత్తిడిని సూచిస్తాయి. దీన్ని సాధారణ జీర్ణాశయ సమస్యలతో పోల్చి పొరబడే అవకాశం ఉంటుంది. హార్ట్ పాల్పిటేషన్స్, అంటే గుండె వేగంగా కొట్టుకోవడం లేదా దడదడలాడడం కూడా ఒక లక్షణం. గుండె స్పందనలు అసమానంగా ఉండటం, ఎలక్ట్రికల్ సంకేతాల్లో అంతరాయం వల్ల కలుగుతాయి. విశ్రాంతిలో లేదా తక్కువ శ్రమలో కూడా ఇది కనిపిస్తే జాగ్రత్త అవసరం. అలసటతోపాటు ఈ లక్షణం ఉంటే జుజ+ పరీక్షలు అవసరం అవుతాయి. హార్ట్ బ్లాకేజ్ లక్షణాలు సాధారణ సమస్యలుగా కనిపించినప్పటికీ, వీటిని నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే గుర్తించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చు.

# ఆధ్యాత్మిక వెల్లువకు బేతంపూడి సిద్ధం...మత సామరస్య వేదికపై నేటి నుంచే'బీహారి బాబా'ఉర్సు సంబరాలు



వార్తాపత్రిక:టేకులపల్లి,ఏప్రిల్ 9 :అక్షరాలా ఏడు దశాబ్దాల చరిత్ర...అంతకు మించిన ఆధ్యాత్మిక వైభవం!కులమతాల సరిహద్దులు చెరిపేస్తూ,మానవత్వమే మతంగా వెలుగొందుతున్న టేకులపల్లి మండలం బేతంపూడి దర్గా నేడు ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.జగత్ ప్రసిద్ధమైన హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బీహారి బాబా వారి వార్షిక ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది.నేటి నుండి మూడు రోజుల పాటు ఈ ప్రాంతం భక్తి కోలాహలంతో మార్మోగనుంది.శుక్రవారం రాత్రి కొత్తగూడెం సూపర్ బజార్ నుండి పవిత్ర గంధం ఊరేగింపుగా బయలుదేరుతుంది.సూఫీ గీతాలు,మేళతాళాల నడుమ సాగే ఈ ఊరేగింపు కనుల పండుగా సాగనుంది.దర్గాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ప్రత్యేక నమాజ్ అనంతరం,పవిత్ర గంధాన్ని బాబా వారి సన్నిధిలో ప్రతిష్ఠించడంతో ఉర్సు ఉత్సవాలు అధికారికంగా మొదలవుతాయి.రాత్రి వేళ భక్తుల హృదయాలను రంజింపజేసేలా ప్రముఖ కళాకారులతో ఖవ్వాలి కచేరీ ఏర్పాటు చేయబడింది.బాబా వారి ఆశీస్సులతో వచ్చే వేలాది మంది భక్తుల కోసం నిర్వాహకులు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ చేస్తున్నారు.హిందూ-ముస్లిం సోదరులు భుజం భుజం కలిపి నిర్వహించే ఈ ఉత్సవం,గంగా-జమునా తెహజీబ్‌కు నిలువుటద్దంగా నిలుస్తోంది.కేవలం స్థానికులే కాకుండా ఖమ్మం,వరంగల్,మహబూబాబాద్ మరియు హైదరాబాద్ వంటి నగరాల నుండి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున,దర్గా కమిటీ తాగునీరు,రవాణా మరియు భద్రత విషయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.వెంకట్యాతండా స్టేజీ మీదుగా బేతంపూడికి చేరుకునే భక్తులందరికీ బాబా వారి ఆశీస్సులు లభించాలని,ఈ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని దర్గా ఉత్సవ కమిటీ సాదరంగా ఆహ్వానిస్తోంది.

# పహాడీషరీఫ్ స్టేషన్‌పై డీసీపీ రాజేష్ ఆకస్మిక తనిఖీ అధికారులకు స్ట్రిక్ట్ ఆదేశాలు

- **పెండింగ్ కేసులపై ఫుల్ ఫోకస్... దర్యాప్తులో వేగం పెంచాలని సూచన**
- **రౌడీ షీటర్లపై కఠిన నిఘా... అసాంఘిక శక్తులపై యాక్షన్ హెచ్చరిక.**
- **విజిబుల్ పోలీసింగ్, నైట్ పెట్రోలింగ్ బలోపేతానికి ఆదేశాలు**



వార్త పత్రిక, రాజేంద్రనగర్, ఏప్రిల్ 09, రంగారెడ్డి జిల్లా :శంషాబాద్ జోన్ డీసీపీ బి. రాజేష్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌లో నమోదైన ఆస్తి, ఘోర నేరాలు పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి అధికారులతో కీలక చర్చలు జరిపారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ముఖ్యమైన కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని, సాక్ష్యాధారాల సేకరణలో నాణ్యతను మెరుగుపరచాలని దర్యాప్తు అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ... పెట్రోలింగ్ వాహనాల పనితీరు, డయల్-100 కాల్స్‌కు వెంటనే స్పందన, నైట్ పెట్రోలింగ్, బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రజా స్నేహపూర్వక పోలీసింగ్‌పై దృష్టి పెట్టాలని, ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీ నారాయణ రెడ్డి, ఎస్ఐలు దయాకర్ రెడ్డి, లక్ష్మయ్య, ఫైసల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాలను కాపాడుకోవాలి



వార్త ప్రతిక :-తొర్రూరు :నేటి పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణ పాటించాలని, ఆరోగ్యాలను కాపాడుకోవాలని తొర్రూరు డిఎం పద్మావతి అన్నారు.డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆరోగ్యం, వైద్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షుగర్, బరువు, హిమోగ్లోబిన్, బీపీ, మరియు సాధారణ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.
ఉచితంగా మందులు పంపిణీ చేశారు.తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు.ఈ సందర్భంగా డి ఎం మాట్లాడుతూ.నేటి పరిస్థితుల్లో ఆరోగ్యం పై దృష్టి సారించాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. ఆహార నియమాలు పాటించాలని, ఆరోగ్యమే అసలైన సంపదని, సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని అన్నారు.మితాహారం, వ్యాయామంతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని,మంచి ఆరోగ్యానికి ఆహార అలవాట్లే ప్రధానమని,ఆహార అలవాట్లు,ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు.డాక్టర్లు ప్రజలకు ఆరోగ్య రక్షణకు సంబంధించిన సలహాలు ఇవ్వడమే కాకుండా సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, శుభ్రమైన నీరు త్రాగడం వంటి అలవాట్లను.అలవరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ విజయ్ కుమార్, ఎస్ టి ఐ రజితా రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



వార్త ప్రతిక :-తొర్రూరు :1985-86 తొర్రూరు జెడ్పి హెచ్ ఎస్ పాఠశాలలో పదవ తరగతి బ్యాచ్ కు చెందిన మండలంలోని మడిపల్లి గ్రామవాసి మహంకాళి మైసయ్య అకాల మరణం చెందడంతో గురువారం ఆ బ్యాచ్ మిత్రులు అందరు కలిసి రూ. 52,000 నగదు ,25 కేజీల బియ్యం, కిరాణా సామాన్లు అందించారు.ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల రవి, వలపు మధుసూదన్,రామ్మోహన్ రెడ్డి, సర్వి వెంకన్న, బందు శీను, టీ.సురేందర్, కృష్ణమూర్తి,కొమరమల్లు, వెంకన్న, మల్లయ్య ,అల్లా బాస్ తదితరులు పాల్గొన్నారు.

